క్లుప్తంగా

ఎంఈఓగా శ్రీనివాస్‌గౌడ్



వీపనగండ్ల: మండల విద్యాధికారిగా బుధవారం శ్రీనివాస్‌గౌడ్ బాధ్యతలు తీసుకున్నారు. గోపాల్‌పేట మండల విద్యాధికారిగా పనిచేస్తున్న ఈయన వనపర్తి, ఏదుల, రేవల్లి, వీపనగండ్ల మండలాలకు ఇన్‌చార్జ్‌గా నియమించారు. విద్యావ్యాప్తి కోసం ప్రతి ఒక్కరూ తమకు సహకరించాలని నూతనంగా పదవీ బాధ్యతలు తీసుకున్న ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్ కోరారు.

మేదరులను ఆదుకోవాలి



ఆత్మకూర్: మేదరులను ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకోవాలని మేదరి మహేంద్రసంఘం నాయకులు బుధవారం తహసీల్దార్ రాజు, కమిషనర్ నాగరాజుకు వేర్వేరుగా వినతి పత్రం అందజేశారు. ప్రపంచ వెదురు దినోత్సవం సందర్భంగా మేదరులు ఆత్మకూర్‌లో సమావేశమయ్యారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, తోటరవి, నాగేష్, నారాయణ, కృష్ణయ్య, కాంతు, మహేష్, నరేందర్, రాము, ఊషన్న, మన్యం, వెంకటేష్, నాగరాజు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వం నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

ఆత్మకూర్: భవన నిర్మాణరంగ కార్మికుల సమస్యలన్నింటినీ పరిష్కరించాలని, ఇన్సూరెన్స్ అమలును ఎల్‌ఐసీకి అప్పగించే నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్రసహాయకార్యదర్శి రాజు అన్నారు. బుధవారం ఆత్మకూర్‌లో భవన నిర్మాణ కార్మికులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటయ్య, నర్సింహ, రాములు, వెంకటన్న, శ్రీనివాసులు, అంజి, జగదీష్, కార్మికులు ఉన్నారు.

వనపర్తి రూరల్: భవన నిర్మాణ కార్మికులతో కలిసి బుధవారం తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం(సీఐటీయూ) నాయకులు వనపర్తి జిల్లా కేంద్రంలోని మర్రికుంట నుంచి ర్యాలీగా వెళ్తూ.. కలెక్టర్ కార్యాలయం గేటు ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలోని ఏఓకు వినతి అందజేశారు. ధర్నాలో పలువురు నాయకులు పుట్ట ఆంజనేయులు, బొబ్బిలి నిక్సన్, అరుణ్, రాజు తదితరులు పాల్గొని మాట్లాడారు. దేశంలో 1996లో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు చట్టం చేస్తే.. అది మన ఉమ్మడి రాష్ట్రంలో 2008లో అమలులోకి వచ్చిందన్నారు. అప్పటి నుంచి ఇప్పటికి వరకు కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారానే సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు గణేష్, వెంకటయ్య, కురుమయ్య, రవి ఉన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతివ్వండి



ఆత్మకూర్: కబడ్డీ క్రీడాకారులకు స్థలాన్ని దానంగా ఇచ్చిన దాతల విగ్రహాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని క్రీడాకారులు బుధవారం తహసీల్దార్ రాజుకి వినతిపత్రం అందజేశారు. మండలంలోని మూలమళ్లలో కబడ్డీ క్రీడాకారుల సౌకర్యార్థం గ్రామంలోని సంత స్థలాన్ని దేశాయి పద్మారెడ్డి వితరణగా అందించారు. ఈసందర్భంగా అక్టోబర్ 20వ తేదీన దాత తల్లిదండ్రుల విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఈసందర్భంగా తహసీల్దార్ రాజు విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు ఇస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో కబడ్డీ క్రీడాకారులు అశోక్, శ్రీను, వెంకట్రాములు, ఎల్లన్న, సత్యం ఉన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి

వనపర్తి రూరల్: జిల్లాలో భారతీయ జనతా పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేయాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయ్యగారి ప్రభాకర్‌రెడ్డి కార్యకర్తలకు సూచించారు. ఆయన స్థానిక బీజేపీ నాయకులతో కలిసి బుధవారం శ్రీరంగాపురం మండల కేంద్రంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటేందుకు అందరూ సహకరించాలని కోరారు. అనంతరం గ్రామస్తులకు పార్టీ సభ్యత్వం అందించారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఇంటింటికీ చేరేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్, వెంకటస్వామి, శివ, లక్ష్మీనారాయణ, ఎల్లస్వామి, మేకల రాములు, రాజు పాల్గొన్నారు.



క్రీడల్లో రాణిస్తేనే గుర్తింపు

గోపాల్‌పేట: మండల కేంద్రంలో బుధవారం ఎస్‌జీఎఫ్ మండల స్థాయి అండర్–14, 17 కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను జిల్లా యూత్ స్పోర్ట్స్ ఆఫీసర్ సుధీర్‌కుమార్‌రెడ్డి, డీసీఈబీ సెక్రెటరీ చంద్రశేఖర్, ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. పోటీల్లో పాల్గొనేందుకు అండర్–14, 17లో వేరు వేరుగా ఎనిమిది బాలికల జట్లు, అండర్–14లో ఆరు బాలుర జట్లు, అండర్–17లో నాలుగు బాలుర జట్లు హాజరయ్యాయి. ఈ పోటీల్లో మొత్తం 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆరుగురు పీఈటీలు ఆటల పోటీలను పర్యవేక్షించారు. ప్రతిభ కనబర్చిన జట్లకు బహుమతులు అందజేశారు. ఇక్కడ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు జిల్లా స్థాయిలో ఆడనున్నారు.

భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు..

విద్యార్థులు క్రీడలు ఆడడం ద్వారా గుర్తింపు వస్తుందని గోపాల్‌పేట పీడీ సురేందర్‌రెడ్డి అన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని విద్యార్థులకు సూచించారు. క్రీడల్లో మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో విద్యార్థులు ప్రతిభ కనబర్చి మెడల్ సాధిస్తే భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరుకుంటారన్నారు. గతేడాది మండలం నుంచి ముగ్గురు, జిల్లా నుంచి 25మంది విద్యార్థులు జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో రాణించారని తెలిపారు.



బుద్దారం గురుకుల, కేజీబీవీ పాఠశాల మధ్య కొనసాగుతున్న కబడ్డీ మ్యాచ్

ఆత్మకూర్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి జాతీయ స్థాయిలో సత్తా చాటాలని ఎంఈఓ భాస్కర్‌సింగ్, కమిషనర్ నాగరాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రహ్మతుల్లా అన్నారు. బుధవారం స్థానిక జాతర మైదానంలో ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ విభాగంలో అండర్–14 నుచి 17 బాలబాలికలు తలపడ్డారు. ఈపోటీల్లో బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు సత్తాచాటి వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీల్లో మొదటి బహుమతులను సాధించారు. ఈసందర్భంగా క్రీడాకారులకు 30 జతల టీషర్టులు, షీల్డులను రహ్మతుల్లా, జుబేర్, జమాల్ తమ సొంత డబ్బులతో అందజేశారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంలు బాలరాజు, విష్ణువర్ధన్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, అనంతరాములు, కోచ్ ఖాదర్, పీఈటీలు సంతోషి, ముకరం, మహేష్, కీర్తన, ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంకట్, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో..

రూ.50 వేల మైక్‌సెట్ వితరణ

ఆత్మకూర్: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో 1982–83 విద్యా సంవత్సరంలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థినులు బుధవారం సమావేశమయ్యారు. స్థానిక బాలికల పాఠశాలలో 42 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారు తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా రూ. 50 వేలు పోగు చేసి పాఠశాలకు డిజిటల్ మైక్రోస్కోప్, ఆంప్లిప్లేయర్, మైక్‌సెట్‌ను బహూకరించారు. కార్యక్రమంలో ఎంఈఓ భాస్కర్‌సింగ్, జీహెచ్‌ఎం బాలరాజు, రియాజుద్దీన్, విజయభాస్కర్‌రెడ్డి, పూర్వవిద్యార్థులు అనురాధ, అనిత, గీతారాణి, నిర్మల, ఖమర్‌సుల్తాన, రేణుక, ఖమరున్నీసా, తారాదేవి, తిరుపతమ్మ, ఉత్తుబాయి, విజయలక్ష్మి, వెంకటరమణకుమారి, సత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూర్ బాలికల పాఠశాలలో మైక్‌సెట్ అందిస్తున్న పూర్వవిద్యార్థులు

నేడు రాజకీయ ప్రతినిధులతో సమావేశం

కొత్తకోట రూరల్: గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికలు–2024కు సంబంధించి ఫొటో ఓటర్ల జాబితాను ఈనెల 13న ఆయా గ్రామ పంచాయతీల్లో ఉంచామని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రవీందర్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశానుసారం మండల పరిషత్ కార్యాలయంలోని ప్రొఫెసర్ జయశంకర్ సమావేశ మందిరంలో అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులు, నాయకులతో గురువారం ఉదయం 10గంటల 30నిమిషాలకు మండల స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని అన్ని పార్టీల ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

న్యాస్ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలి

వనపర్తి రూరల్: నవంబర్‌లో నిర్వహించే న్యాస్ పరీక్షలకు విద్యార్థులను పూర్తిగా సిద్ధం చేయాలని మండల విద్యాధికారి జయరాములు ఉపాధ్యాయులకు సూచించారు. శ్రీరంగాపురం మండల కేంద్రంలోని మండల కాంప్లెక్స్ హెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మార్సీలో జరిగిన ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సమావేశంలో ఎంఈఓ పాల్గొని మాట్లాడారు. వనపర్తి జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలపాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రస్తుతం పాఠశాలల్లో అమలవుతున్న ప్లాన్ కార్యక్రమాన్ని వివిధ రకాల బోధనాభ్యాసన సామగ్రి, వినూత్న బోధన పద్ధతులను ఉపయోగించి ఆసక్తిగా మార్చాలని వనపర్తి జిల్లా మొబిలైజేషన్ అధికారి యుగంధర్ అన్నారు. విద్యార్థులకు అభ్యాస దీపికలను నిరంతరం సాధన చేయించాలని, ప్రైమరీ స్థాయిలో విద్యార్థులకు గుణాత్మక అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో రాజు, సీఆర్పీ శ్రీలత ఉపాధ్యాయులు ఉన్నారు.

బైక్‌లు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలు

అమరచింత: ఎదురెదురుగా వస్తున్న రెండు మోటార్ బైక్‌లు అదుపు తప్పి ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన మంగళవారం మధ్య రాత్రి పాంరెడ్డిపల్లి శివారులో చోటుచేసుకుంది. మహబూబ్‌నగర్ జిల్లా ఉంద్యాల గ్రామానికి చెందిన లింగంశివతో పాటు నర్సింహశెట్టి వనపర్తి జిల్లా అమరచింతకు వినాయక పూజ సామగ్రి కోసం బైక్‌పై వస్తున్నారు. గద్వాల నుంచి మరికల్‌కు బైక్‌పై వెళ్తున్న ఆసీఫ్, ఖాజా అమరచింత మండలం పాంరెడ్డిపల్లి శివారులోకి రాగానే ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టారు. దీంతో నర్సింహశెట్టి, ఆసీఫ్, ఖాజాకు తీవ్ర రక్త గాయాలు కావడంతో ప్రథమ చికిత్స నిమిత్తం ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంలో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై లింగం శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

క్రీడాప్రాంగణాన్ని కాపాడాలని వినతి

ఖిల్లాఘనపురం: మండలంలోని రుక్కన్నపల్లిలో గ్రామకంఠం భూమిలో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణాన్ని కాపాడాలని గ్రామస్తులు బుధవారం తహసీల్దార్ పాండునాయక్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ వంద ఏళ్ల క్రితం నాటి ఇంటిని యజమాని తాయారమ్మ 1,350 గజాల స్థలాన్ని గ్రామానికి దానపూర్వకంగా రాసి ఇచ్చారని తెలిపారు. ఈ స్థలంలో క్రీడాప్రాంగణాన్ని ఏర్పాటు చేశారని వారు తహసీల్దార్‌కు వివరించారు. ఈ స్థలాన్ని కొందరు వ్యక్తులు తప్పుడు సర్వే చేయించుకుని కబ్జా చేయాలని చూస్తున్నారన్నారు. ప్రభుత్వం నుంచి సర్వే చేయించి క్రీడాప్రాంగణాన్ని కాపాడాలని వారు తహసీల్దార్‌ను కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కెతావత్ నరేష్, పెంకుల అంజనేయులు, శివకుమార్, వెంకటయ్య, నక్క వెంకటయ్య, రాములు, సంతోష్, కురుమయ్య, నరేష్ తదితరులు ఉన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రుక్కన్నపల్లి గ్రామస్తులు

పరామర్శ


కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని మోజర్లకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సైకిల్ నర్సింహ(55) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. స్థానిక కాంగ్రెస్ నాయకులతో సమాచారం తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి బుధవారం మోజర్లకు చేరుకుని నర్సింహ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. రానున్న రోజుల్లో కుటుంబానికి అండగా ఉంటానని భరోసానిచ్చారు. ఆయన వెంట నాగరాజు, గట్టు మన్యం, పీఏసీఎస్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, దయాకర్, బాబురావు, రాములు, రాజు, బుచ్చిలింగం, సత్తిరెడ్డి, శ్రీను, నాగన్న, పెంటన్న, భగవంతు ఉన్నారు.

ఆదిదంపతుల కల్యాణం

కొత్తకోట రూరల్: మండల పరిధిలోని కానాయపల్లి గ్రామ శివారులోని శ్రీదత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం పౌర్ణమి సందర్భంగా ఆదిదంపతులైన శివపార్వతుల కల్యాణోత్సవాన్ని ఆలయ నిర్వాహకులు, భక్తులతో కలిసి అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ వారు స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. అర్చకులు వేదమంత్రాలతో కన్యాదానం జరిపి మాంగల్య పూజలు చేయగా.. పెద్ద ఎత్తున హాజరైన భక్తుల మధ్య కల్యాణోత్సవాన్ని కనులపండువగా జరిపించారు. కల్యాణమూర్తులకు ధూపదీప నైవేద్యాలతో మహామంగళహారతి సమర్పించారు. శివపార్వతులకు అర్చకులు తలంబ్రాలు పోయగా.. ఆడపడుచులు అమ్మవారికి వడిబియ్యం పోశారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేయడంతో పాటు అన్నదానం చేశారు.



పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందాం..



పెద్దగూడెంలో ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు



తెల్లరాళ్లపల్లితండాలో మానవహారం




ఆత్మకూర్‌లో..

ఆత్మకూర్: పట్టణంలోని ఎంవీ రామన్ ఉన్నతపాఠశాలలో బుధవారం స్వచ్ఛ భారత్– స్వచ్ఛ ఆత్మకూర్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛతాహీ సేవా 2024 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు, స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ తడి, పొడి చెత్త నిర్వహణను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం వస్తుందన్నారు. పరిసరాల పరిశుభ్రత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు.

పాన్‌గల్: స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు అవుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యనాయక్ అన్నారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా రెండో రోజు బుధవారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పంచాయతీ కార్యదర్శి కుర్మన్నతో కలిసి పాల్గొన్నారు. మన గ్రామాన్ని అందరం కలిసి పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలకు దూరంగా ఉండవచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రజలు, యువజన సంఘాలు, మహిళ సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధులు భాగస్వాములు అవుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సహకరించాలని కోరారు. అనంతరం స్వచ్ఛ గ్రామంపై మానవహారం, ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శాంతమ్మ, ఫీల్డు అసిస్టెంట్ సోమ్లనాయక్, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, తండా వాసులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: పచ్చదనంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచినప్పుడే అంటు రోగాలు వ్యాప్తి చెందకుండా ఉంటాయని ఎంపీడీఓ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పాఠశాల, కళాశాల విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను కాపాడాలని ప్రతిజ్ఞ చేయించారు. పరిసరాల పరిశుభ్రత కోసం పంచాయతీ అధికారుల సూచనలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏపీఓ శేఖర్‌గౌడ్, కళాశాల అధ్యాపకుడు లక్ష్మీనారాయణ, అంగన్‌వాడీ టీచర్లు సుగుణాబాయి, సువర్ణ పాల్గొన్నారు.



వీపనగండ్లలో..

వనపర్తి రూరల్: మండలంలోని పెద్దగూడెంలో బుధవారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో ఎంపీడీఓ రాఘవ పాల్గొని విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛత మీద విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి, గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీఓ సుదర్శన్, కార్యదర్శి మల్లికార్జున్, క్షేత్ర సహాయకుడు పాష, ఏఎన్‌ఎం, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఒకేషనల్ విద్యతో మెరుగైన ఉపాధి

పాన్‌గల్: సంప్రదాయ చదువుతో పాటు ఒకేషనల్ విద్యను సద్వినియోగం చేసుకుంటే ఉపాధి అవకాశాలు పొందొచ్చని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి మహానంది, జిల్లా పరీక్షల విభాగం కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఉన్నత పాఠశాలల్లో సాధారణ విద్యతో పాటు ఒకేషనల్ విద్య బోధిస్తున్నారని, ఐటీ కంప్యూటర్ నాలెడ్జ్, అగ్రికల్చర్ ఈ రెండు విభాగాలు కొనసాగుతాయన్నారు. వృత్తి విద్య కోర్సును అభ్యసిస్తే ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని స్పష్టం చేశారు. అనంతరం వృత్తి విద్య కోర్సు అభ్యసిస్తున్న విద్యార్థులకు కంప్యూటర్లు, అగ్రికల్చర్ కిట్లు అందజేశారు.

కాంప్లెక్స్ సమావేశం పరిశీలన

మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలల్లో ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న కాంప్లెక్స్ సమావేశాన్ని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి, జిల్లా పరీక్షల విభాగం కార్యదర్శి సందర్శించారు. ఈ కాంప్లెక్స్ సమావేశంలో తొలిమెట్టు కార్యక్రమం, నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (న్యాస్), అకాడమిక్ అంశాలపై సమావేశంలో చర్చించి పలు సూచనలు చేశారు. ఆయా అంశాలపై ఆర్పీలు వెంకటేష్ ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ సమాశానికి మొదటి రోజు 50 శాతం, రెండో రోజు 50 శాతం ఉపాధ్యాయులు హాజరవుతారన్నారు. సమావేశంలో మండల నోడల్ ఆఫీసర్ శ్రీనివాసులు, కాంప్లెక్స్ హెచ్‌ఎం నరేందర్ ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన, అక్షరాభ్యాసం

కొత్తకోట రూరల్: మండలంలోని కనిమెట్టలో గల అంగన్‌వాడీ కేంద్రం–3లో పోషణ అభియాన్‌లో భాగంగా బుధవారం అంగన్‌వాడీ టీచర్ సువర్ణ ఆధ్వర్యంలో చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ మాట్లాడుతూ చిరుధాన్యాలతోనే సంపూర్ణమైన ఆరోగ్యం ఇమిడి ఉంటుందని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతమైన జీవితం కోసం మంచి పోషకాలు ఉన్న ఆహారాన్ని తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలకు, గర్భిణులకు, కిషోర బాలికలకు ఇచ్చే బాలామృతం, గుడ్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, పరశురాం, అంగన్‌వాడీ ఆయాలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులు తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులతో అంగన్‌వాడీ టీచర్, తల్లిదండ్రులు

మహారాష్ట్ర ఎమ్మెల్యే గైక్వాడ్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



కొత్తకోట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



పెబ్బేరులో సుభాష్ చౌరస్తాలో..

కొత్తకోట రూరల్: ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన మహారాష్ట్రకు చెందిన శివసేన పార్టీ ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్, బీజేపీ నేత తన్వీందర్‌సింగ్‌పై చర్యలు తీసుకోవాలంటూ కాంగ్రెస్ నాయకులు బుధవారం కొత్తకోట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మహారాష్ట్రలోని విదర్భ జిల్లా బుల్దానా నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే సంజయ్‌గైక్వాడ్ ఇటీవల మహారాష్ట్రలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ రాహుల్ గాంధీ నాలుక కోస్తే రూ.11లక్షల బహుమతిగా ఇస్తానని ప్రకటించడం, బీజేపీ నేత తన్వీందర్‌సింగ్ సైతం రాహుల్ గాంధీ బయటకు వస్తే చంపేస్తానని బహిరంగంగా మాట్లాడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మేస్త్రీ శ్రీనివాసులు, బీచుపల్లియాదవ్, పి.ప్రశాంత్, బోయేజ్, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, సాయిరెడ్డి, మాసన్న, సురేందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, బాలకొండయ్య, శ్రీనివాసులు, దిలీప్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, శ్రీకాంత్, శ్యామ్, ఎండీ తయాబ్, లక్ష్మయ్యయాదవ్, బాలరాజు తదితరులు ఉన్నారు.

వనపర్తి రూరల్: ఏఐసీసీ అగ్రనేత, పార్లమెంట్ ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీపై బీజేపీ, శివసేన నాయకులు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బుధవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్ ఆధ్వర్యంలో రాజీవ్‌చౌరస్తాలో, పెబ్బేరులోని సుభాష్ చౌరస్తాలో బీజేపీ, శివసేన పార్టీల దిష్టిబొమ్మలను దహనం చేశారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

అమరచింత: మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా అన్ని రంగాల్లో రాణించి తమ కుటుంబాలను ముందుకు తీసుకెళ్లాలని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వెంకటమ్మ, ఏపీఎం శ్రీనివాసులు అన్నారు. ఐకేపీ కార్యాలయంలో బుధవారం మండల మహిళా సమాఖ్య 8వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలను సభ్యులకు వివరించారు. గతేడాది బ్యాంకు లింకేజీల ద్వార రూ.7 కోట్లు టార్గెట్‌ను పూర్తి చేశామన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.30 లక్షల లావాదేవీలు జరగగా.. వీటి ద్వారా సంఘానికి రూ.1.15లక్షల లాభం వచ్చిందన్నారు. మండల మహిళా సమాఖ్య ద్వారా కస్టమర్ హైరిక్ సెంటర్ ఏర్పాటు కోసం డ్రోన్ కొనుగోలు చేయుటకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. మహిళా సంఘాల బలోపేతంతో పాటు బ్యాంకు లింకేజీలు, శ్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకునేలా తగు ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి గాయత్రి, ఈసీ సభ్యులు నిర్మల, శిరీష, సుజాత, సులోచన తదితరులు పాల్గొన్నారు.

మహా గణపతి పూజలందుకో..

ఆత్మకూర్: పట్టణంలోని బీసీకాలనీలో ఏర్పాటు చేసిన 21 అడుగుల మహా గణపతికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం మంజుల కరుణాకర్, యాదమ్మ అంజనేయులు, గాయత్రి శ్రీనివాసులు దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ప్రత్యేక పూజల్లో చైర్‌పర్సన్ గాయత్రి రవికుమార్ దంపతులు, వార్డు మాజీ సభ్యుడు గద్దమీది శ్రీనివాసులు, భరత్, భక్తులు పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో పూజలు చేస్తున్న భక్తులు

గంగమ్మ ఒడిలోకి గణనాథులు

ఖిల్లాఘనపురం: మండలంలో బుధవారం వినాయక నిమజ్జనం కార్యక్రమాలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఖిల్లాఘనపురం, అప్పారెడ్డిపల్లి తదితర గ్రామాల్లో నిమజ్జనం సందర్భంగా ఉదయం నుంచి స్వామివారి మండపాల వద్ద ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారి వద్ద ఉంచి పూజలు నిర్వహించిన లడ్డు, పండ్లు తదితర వాటి వేలం వేశారు. అనంతరం గణనాథులను వాహనాల్లో ఉంచి గ్రామాల్లోని వీధుల్లో ఊరేగింపు చేశారు. ఈ సందర్భంగా మహిళలు బొడ్డమ్మలు, యువకులు కోలాటం వేయడంతో పాటుగా డప్పులకు అనుగుణంగా యువత నృత్యం చేశారు.



ఖిల్లాఘనపురం మండలం అప్పారెడ్డిపల్లిలో..

గతంలో మంజూరైన రోడ్డుకు శంకుస్థాపనా?

ఖిల్లాఘనపురం: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి మంజూరు చేయించిన బీటీ రోడ్డు పనులకు బుధవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేయడం హాస్యాస్పదమని మాజీ ఎంపీపీ కృష్ణానాయక్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సామ్యనాయక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య అన్నారు. బుధవారం ఖిల్లాఘనపురంలో బీటీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి శంకుస్థాపన చేయడంపై బీఆర్‌ఎస్ నాయకులు మండల కేంద్రంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలోనే మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి రోడ్డు రినివల్ కోట్ పనులకు నిధులు మంజూరు చేశారన్నారు. ఇందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2022 నవంబర్ 22న రూ.6.60 కోట్లు మంజూరు చేసిందన్నారు.



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు